దుర్గామాత విగ్రహాన్ని అందజేసిన ధనురాజ్ ముదిరాజ్...

కొల్చారం, అక్టోబర్ 19(ప్రజా జ్యోతి)

మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామంలో పోచమ్మ గుడి సమీపంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించేందుకు అప్పాజిపల్లి గ్రామానికి చెందిన కన్నెబోయిన ధనురాజ్ ముదిరాజ్ దుర్గామాత విగ్రహ దాతగా వ్యవహరించారు.

వివరాలు 2లో

సంగారెడ్డి మెదక్

మంగళవారం 20 అక్టోబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:06

టీ.జీ.పీ.ఎస్.సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :--

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీ.జీ.పీ.ఎస్.సీ) ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు (సీబీటీ) పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్-××), అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి సంబంధించి పరీక్షల నిర్వహణపై టీ.జీ.పీ.ఎస్.సీ చైర్మన్ బుర్రా వెంకటేశం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించి పలు సూచనలు చేశారు.కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని గీతం యూనివర్సిటీలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 24న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్-××) పోస్టులకు సంబంధించి రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

వివరాలు 2లో

బతుకమ్మ,దసరా పండుగ వేళ ఆడపడుచులకు చీరల పంపిణీ

- పండుగ సంతోషంలో భాగస్వామిగా నిలిచిన కాంగ్రెస్ నాయకుడు పులిమామిడి నవీన్ గుప్తా

శివ్వంపేట ప్రజాజ్యోతి అక్టోబర్ 19:

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ,దసరా పండుగలను పురస్కరించుకొని శివ్వంపేట ఆడపడుచులకు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పులిమామిడి నవీన్ గుప్తా చీరలను చిరుకానుకగా పంపిణీ చేశారు.పండుగ వేళ మహిళల ముఖాల్లో చిరునవ్వులు నింపాలనే ఉద్దేశంతో ఆయన చేపట్టిన ఈ కార్యక్రమం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది.తెలంగాణ ఆడపడుచులకు ఎంతో ప్రీతిపాత్రమైన బతుకమ్మ పండుగను మహిళలు సంప్రదాయబద్ధంగా,ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటారు.

వివరాలు 2లో

కొండాపూర్ మండల ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

ప్రజలందరూ సుఖసంతోషాలతో, ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలి

కొండాపూర్ సీఐ సుమన్ కుమార్, ఎస్సై సోమేశ్వరి

కొండాపూర్ ప్రజా జ్యోతి

విజయదశమి పండుగను పురస్కరించుకొని కొండాపూర్ మండల ప్రజలందరికీ కొండాపూర్ సీఐ సుమన్ కుమార్, ఎస్సై సోమేశ్వరి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు నింపాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సీఐ సుమన్ కుమార్, ఎస్సై సోమేశ్వరి మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని, ఈ పండుగ ప్రజల్లో ఐకమత్యం, సోదరభావం, పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. ప్రజలందరూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని సూచించారు.

పండుగ వేళ పోలీసుల సూచనలు పాటించాలి

విజయదశమి వేడుకల సందర్భంగా ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు సహకరించాలని వారు కోరారు. పండుగ సమయంలో ప్రయాణాలు చేసేవారు తప్పనిసరిగా రహదారి భద్రతా నియమాలను పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అటువంటి చర్యలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు.అలాగే వాహనాలను అతివేగంగా నడపకూడదని, ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పండుగ వేడుకల సందర్భంగా ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరించకూడదని, ఎలాంటి అవాంఛనీయ

సంఘటనలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు.

ప్రజల భద్రతే పోలీసుల ప్రాధాన్యం

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని వారు తెలిపారు. పండుగ వేళ ప్రజలు పోలీసుల సూచనలకు ప్రాధాన్యతనిస్తూ, నిబంధనలను పాటించి పోలీసులకు

సహకరించాలని కోరారు. ఏవైనా అనుమానాస్పద ఘటనలు లేదా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.విజయదశమి పండుగను ప్రతి ఒక్కరూ సురక్షితంగా, ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలని, కొండాపూర్ మండలంలో పండుగ వాతావరణం ఆనందదాయకంగా ఉండాలని సీఐ సుమన్ కుమార్, ఎస్సై సోమేశ్వరి ఆకాంక్షించారు.

టీ.జీ.పీ.ఎస్.సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి

మొదటి సెషన్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఈ పరీక్షలకు మొత్తం 150 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.అభ్యర్థులు నిర్దిష్ట సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. మొదటి సెషన్‌కు ఉదయం 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని, ఉదయం 9.30 గంటలకు గేట్లు మూసివేస్తారని తెలిపారు. రెండో సెషన్‌కు మధ్యాహ్నం 1 గంట నుంచి అనుమతిస్తారని, మధ్యాహ్నం 2 గంటలకు గేట్లు మూసివేస్తారని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఈ సమయాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, పుస్తకాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించడంతో పాటు, కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా యువజన క్రీడల శాఖ ఇన్‌చార్జి అధికారి అఖిలేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ,దసరా పండుగ వేళ ఆడపడుచులకు చీరల పంపిణీ

మొదటిపేజీ తరువాయి

ప్రకృతిని ఆరాధిస్తూ, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంబరాలు చేసుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది.ఇలాంటి పర్వదినం సందర్భంగా ఆడపడుచులకు చీరలను అందజేసి వారి పండుగ సంతోషంలో భాగస్వామిగా నిలవడం ద్వారా నవీన్ గుప్తా తన ఆత్మీయతను చాటుకున్నారు.రాజకీయాలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజల మధ్య ఉంటూ,వారి సుఖదుఃఖాల్లోనూ,పండుగ వేడుకల్లోనూ భాగస్వాములు కావడం నాయకుడి సామాజిక బాధ్యతకు నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు. మహిళలకు గౌరవం ఇస్తూ,తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగ వేళ తన వంతు సహకారం అందించడం అభినందనీయమని పేర్కొంటున్నారు.బతుకమ్మ, దసరా పండుగలు ప్రజల మధ్య ఐక్యతను,ఆత్మీయతను, సోదరభావాన్ని పెంపొందించే పర్వదినాలని,ఇలాంటి సందర్భాల్లో నిర్వహించే సేవా కార్యక్రమాలు పండుగ ఆనందాన్ని మరింత పెంచుతాయని పలువురు పేర్కొన్నారు.ఆడపడుచుల సంతోషమే పండుగకు అసలైన శోభగా భావిస్తూ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన పులిమామిడి నవీన్ గుప్తాను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వారాల గణేష్, బిస్కుంది అంజయ్య, కమలయ్య గారి వెంకటేష్, దావూద్,వంజరి నాగభూషణం,వజ్జ శీను,దానబోయిన కృష్ణ,ఈసారపు రాజు గౌడ్,ఆంజనేయులు,సద్దాం,తదితర కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

దుర్గామాత విగ్రహాన్ని అందజేసిన ధనురాజ్ ముదిరాజ్...

మొదటిపేజీ తరువాయి

దుర్గామాత విగ్రహాన్ని అందజేసి అమ్మవారి పట్ల తన భక్తిని చాటుకున్న ధనురాజ్ ముదిరాజ్‌ను గ్రామస్తులు అభినందించారు. దుర్గామాత ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు ఆయన్ను శాలువాతో సన్మానించారు.

ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ జిల్లా యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్.

టేక్మాల్, అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి ప్రతినిధి.)

చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి దసరా పర్వదినం సందర్భంగా బిఆర్ఎస్ జిల్లా యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ నాయకులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయదశమి ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలను, ఆశయాలను విజయాలను తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో దసరా పండుగకు ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక విశిష్టత ఉందన్నారు. దసరా రోజున జమ్మి చెట్టును పూజించి, జమ్మి ఆకులను 'బంగారం'గా భావించి ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవడం, పాలపిట్టను దర్శించుకోవడం మన ప్రత్యేక సంప్రదాయమని పేర్కొన్నారు.పాలపిట్ట దర్శనాన్ని శుభసూచకంగా భావిస్తూ, జమ్మి ఆకులతో ఆత్మీయతను పంచుకుంటూ బంధుమిత్రులతో ఆనందంగా జరుపుకునే ఈ పండుగ అందరి ఇళ్లలో సుఖసంతోషాలు నింపాలని కోరారు. రైతన్నల పంటలు సమృద్ధిగా పండి పల్లెలు పాడిపంటలతో కళకళలాడాలని, శ్రీ దుర్గా అమ్మవారి దివ్య ఆశీస్సులతో అన్ని వర్గాల ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని ఈ సందర్భంగా ఆయన ప్రార్థించారు.

అర్హులకు ఎంతో మేలు స్మార్ట్ రేషన్ కార్డులు తహసీల్దార్ తులసి రామ్.

- కుసంగి లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన తాసిల్దార్ తులసీరామ్, రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్.

టేక్మాల్ అక్టోబర్ 19

(ప్రజా జ్యోతి ప్రతినిధి.)

నకిలీ కార్డులకు అడ్డుకట్ట వేస్తూ, పూర్తి భద్రతా ప్రమాణాలతో రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డులు పేద ప్రజలకు ఎంతో ప్రయోజన కరంగా మారతాయని టేక్మాల్ మండల తహసీల్దార్ తులసి రామ్ పేర్కొన్నారు. సోమవారం మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని కుసంగి గ్రామ పంచాయతీ ప్రాంగణంలో గ్రామ సర్పంచ్ సంగమేశ్వర్ గౌడ్‌తో కలిసి ఆయన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ తులసి రామ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ కొత్త కార్డుల ప్రక్రియను చేపట్టిందన్నారు. అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో రూపొందించిన ఈ స్మార్ట్ కార్డులు కేవలం రేషన్ బియ్యం, నిత్యావసర సరుకులకే పరిమితం కాకుండా, ప్రభుత్వం అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలు లబ్ధికి కీలక ఆధారంగా ఉపయోగపడతాయని స్పష్టం చేశారు.ఈ పంపిణీ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సీనియర్ నాయకులు భగవాన్ రెడ్డి, మొగుల్ రెడ్డి, విక్రమ్ గౌడ్, డాకూరి లక్ష్మయ్య, ఫక్రోద్దీన్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు ముత్యంగారి వెంకయ్య, అనిల్ గౌడ్, వెంకట్ గౌడ్, రెవెన్యూ సిబ్బంది, గ్రామ మహిళలు, లబ్ధిదారులు యువకులు సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గ భవాని అమ్మవార్లను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే గారు

పెద్ద శంకరంపేట్ పట్టణంలోని వైశ్య సంఘం మరియు గంగపుత్ర సంఘం. మండలంలోని మూసాపేట్ మరియు మర్చంట్ పల్లి గ్రామాలలో దుర్గ భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గా భవాని మాత అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాల సేకరించిన గౌరవ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి గారు వారితోపాటు మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ వైస్ ఎంపీపీ రమేష్, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు సురేష్ గౌడ్, సుభాష్ మాజీ సర్పంచ్ సత్యనారాయణ,సర్పంచులు కోణం అంజయ్య, అడివయ్య, మాజీ సర్పంచులు అశోక్, శంకర్ గౌడ్, యాదుళ్ళ, వెంకట్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సందూరి రంగమ్మ మృతికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి నివాళి

టేక్మాల్,అక్టోబర్ 19: (ప్రజా జ్యోతి ప్రతినిధి.)

మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని కోరంపల్లి గ్రామానికి చెందిన, నారాయణఖేడ్ పీర్ డీఈ సందూరి మధుసూదన్ రెడ్డి తల్లి రంగమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొని ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. రంగమ్మ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తల్లిని కోల్పోయిన మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు నిమ్మ రమేష్, జోగిపేట మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, సుబేదార్ మాణికిషన్, మెదక్ జిల్లా ఆర్టీఏ మెంబర్ మల్లారెడ్డి, కిషన్ రెడ్డి, మాధవరెడ్డి, కోరంపల్లి గ్రామ సర్పంచ్ ప్రసన్న వినీత్ కుమార్, ఉప సర్పంచ్ కుమ్మరి నాగరాజు, మాజీ సర్పంచ్ సత్తెమ్మ విఠల్, పరమేశ్వర్, పలువురు వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొని నివాళులర్పించారు.

ఏడుపాయల వనదుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి

- అమ్మవారికి ప్రత్యేక పూజలు....
- ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థన....

కొల్చారం, అక్టోబర్ 19(ప్రజా జ్యోతి)

మెదక్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల వనదుర్గ భవానీ మాతను నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. ప్రజలకు శాంతి, సౌభాగ్యాలు కలగాలని వనదుర్గమ్మను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కొల్చారం మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్ గుప్తా, కొల్చారం మండలం యువత విభాగం అధ్యక్షుడు తుంకులపల్లి సంతోష్ రావు, సీనియర్ నాయకులు కొమ్ముల యాద గౌడ్, చిట్యాల యాదయ్య, గౌరీ శంకర్, కొల్చారం మండలం బి ఆర్ ఎస్ వి అధ్యక్షుడు కొమ్ముల సురేష్ గౌడ్, కొల్చారం మండలం బి ఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య....

- బోర్లు వేసినా అందని నీరు....- ఎండిపోయిన వరి పంట....

రూ.3 లక్షల అప్పులు ఎలా తీర్చాలోనన్న ఆవేదనతో రైతు బలవన్మరణం....

కొల్చారం,అక్టోబర్19(ప్రజా జ్యోతి)

అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన కొల్చారం మండలంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుమ్మరి కిష్టయ్య (54) తనకున్న వ్యవసాయ భూమిలో సాగునీటి కోసం రెండు బోర్లు వేయగా, రెండింటిలోనూ నీరు పడకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మరోవైపు నీరు లేక వరి పంట ఎండిపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆవేదనకు గురై ప్రాణాలు తీసుకున్నాడు.రెండు బోర్లు వేసినా ఫలితం శూన్యంవివరాల్లోకి వెళితే కొల్చారం గ్రామానికి చెందిన కుమ్మరి కిష్టయ్యకు గ్రామ శివారులో ఒక ఎకరం వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో సాగు చేసేందుకు సుమారు మూడు నెలల క్రితం రెండు బోర్లు వేయించాడు. అయితే, రెండు బోర్లలోనూ నీరు పడకపోవడంతో సుమారు రూ.3 లక్షల వరకు అప్పులయ్యాయి. సాగు చేసిన వరి పంటకు నీరు అందకపోవడంతో పంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో పెట్టుబడుల కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక గత వారం రోజులుగా తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్లు సమాచారం.ఆసుపత్రికి తరలించగా అప్పుల బాధతో మనస్తాపానికి గురైన కిష్టయ్య ఆదివారం రాత్రి ఇంటి సమీపంలో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఉరితాడు నుంచి విడిపించి చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.కేసు నమోదు చేసిన పోలీసులుసమాచారం అందుకున్న కొల్చారం ఎస్సై మహమ్మద్ మొహినుద్దీన్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రామ పంచాయతీ సిబ్బందికి దసరా కానుకగా నూతన వస్త్రాలు పంపిణీ చేసిన - చేసిన హుగ్గెల్లి

గ్రామ సర్పంచ్ పట్లోళ్ల. విమల శ్రీనివాస్ రెడ్డి

జహీరాబాద్, అక్టోబర్ 19(ప్రజా జ్యోతి న్యూస్)

దసరా పండుగను పురస్క రించుకుని హుగ్గెల్లి గ్రామ సర్పంచ్ పట్లోళ్ల. విమల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాలను దసరా కానుకగా అందజేశారు. పండుగ వేళ సిబ్బందిలో ఆనందాన్ని నింపుతూ, వారి సేవలను గుర్తించి వస్త్రాలు పంపిణీ చేయడం అభినంద నీయమనీ పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పట్లోళ్ల.విమల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాత్ర కీలక మని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో వారి కృషి ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహిపాల్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపల్లిలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

- సర్పంచ్ పెంజర్ల మమత నర్సింలు యాదవ్ ఆధ్వర్యంలో పండుగకు ఘనమైన ఏర్పాట్లు

శివ్వంపేట ప్రజాజ్యోతి అక్టోబర్ 19:

తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ సంబరాలు శివ్వంపేట మండలం గుండ్లపల్లి గ్రామంలో సోమవారం ఘనంగా జరిగాయి.గ్రామ సర్పంచ్ మమత నర్సింలు ఆధ్వర్యంలో పండుగ వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగలో భాగంగా సద్దుల బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది.ప్రకృతిని ఆరాధిస్తూ,వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత.మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి,బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాల్లో పాల్గొనడం తెలంగాణ సంస్కృతి గొప్పతనాన్ని చాటిచెబుతుంది.గుండ్లపల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని సర్పంచ్ మమత నర్సింలు ఆధ్వర్యంలో ఏర్పాట్లకు ప్రాధాన్యత ఇచ్చారు.గ్రామంలో పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు, గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప వేడుకగా నిలుస్తోంది.తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామంలో ఘనంగా నిర్వహించడంతో గ్రామస్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.ఈ కార్యక్రమానికి అవుల రాజి రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు వారి వెంట స్థానిక సర్పంచ్ పెంజర్ల మమత నర్సింహులు యాదవ్,వెంకట్రాంరెడ్డి,పులిమామిడి నవీన్ గుప్తా,కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామస్తులు ఉన్నారు.

శివ్వంపేట రామాలయంలో దుర్గామాత పూజలో పాల్గొన్న పులిమామిడి నవీన్ గుప్తా

దుర్గామాత ఉత్సవాలకు రూ.21 వేల విరాళం అందజేత,,

శివ్వంపేట ప్రజాజ్యోతి అక్టోబర్ 19:

మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలోని రామాలయంలో నిర్వహించిన దుర్గామాత పూజా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పులిమామిడి నవీన్ గుప్తా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా దుర్గామాత ఉత్సవాల నిర్వహణకు రూ.21,000 విరాళంగా అందజేశారు.దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామాలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పూజా కార్యక్రమంలో నవీన్ గుప్తాతో పాటు కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు,సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన వారాల గణేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దుర్గామాత ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తన వంతు సహకారంగా రూ.21 వేల విరాళాన్ని అందజేసిన నవీన్ గుప్తాను కమిటీ సభ్యులు అభినందించారు.పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ ఆలయాల అభివృద్ధికి,ఉత్సవాల నిర్వహణకు సహకరించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,భక్తులు పాల్గొన్నారు.

ముమ్మాదేవి అమ్మవారిని దర్శించుకున్న సీఐ నర్సిములు

రాయికోడ్ అక్టోబర్ 19 (ప్రజాజ్యోతి):

శ్రీ ముమ్మాదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల ముగింపు వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా జహీరాబాద్ రూరల్ సీఐ నర్సిములు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉత్సవాల్లో భాగంగా అర్చకులు సందీప్ జోషి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు రూరల్ సీఐ నర్సిములు, స్థానిక ఎస్సై చైతన్య కిరణ్‌లను శాలువాలతో సత్కరించారు.నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయంలో భక్తి వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు..

ప్రజావాణికి 11 ఫిర్యాదులు

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ పాండులి

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :-

– ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా, ప్రాధాన్యతనిస్తూ ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పాండు అధికారులను ఆదేశించారు.సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలపై అదనపు కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 11 ఫిర్యాదులు అందాయి. డివిజన్ల వారీగా సంగారెడ్డి నుంచి 3, నారాయణఖేడ్ నుంచి 1, జహీరాబాద్ నుంచి 2 ఫిర్యాదులు రాగా, కలెక్టరేట్ ప్రజావాణికి 5 ఫిర్యాదులు అందాయి. అందోల్ డివిజన్ నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ ముమ్మాదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

– ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్,

మాజీ జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి

రాయికోడ్ అక్టోబర్ 19 (ప్రజాజ్యోతి):

మండల కేంద్రంలో శ్రీ ముమ్మాదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్,మాజీ జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఆలయ పరిసరాలు పూలమాలలు,విద్యుద్దీపాల అలంకరణలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.వేదికపై నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు పాల్గొని ఉత్సవాల ప్రాధాన్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్,బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు విట్టల్, ప్రధాన కార్యదర్శి శంకర్, గ్రామ సర్పంచ్ రాధా తుకారం, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ప్రైవేట్ ఉద్యోగి జహంగీర్‌కు తీవ్ర గాయాలు

హత్నూర 19అక్టోబర్ (ప్రజాజ్యోతి)

మండలంలోని నస్తీపూర్ గేటు వద్ద విద్యుత్ ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ స్తంభంపై పనులు చేస్తుండగా ప్రైవేట్ ఉద్యోగి జహంగీర్ (20) విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనతో స్థానికంగా ఆందోళన నెలకొంది. విద్యుత్ షాక్ కారణంగా జహంగీర్‌కు తీవ్ర గాయాలు కావడంతో అతడి పరిస్థితి విషమంగా మారినట్లు సమాచారం.మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం అక్కడ చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది.అయితే ఈ ప్రమాదానికి కాసాల లైన్‌మెన్ మహేష్ నిర్లక్ష్యమే కారణమని బాధితుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ పనులు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందా అనే అంశంపై అధికారులు సమగ్ర విచారణ జరపాలని వారు కోరుతున్నారు.తమ కుటుంబానికి తీవ్ర ఆవేదన కలిగించిన ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి, ప్రమాదానికి గల కారణాలను నిష్పక్షపాతంగా విచారించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు,బాధితుడికి మెరుగైన వైద్యం అందేలా అధికారులు సహకరించాలని కోరుతున్నారు. విద్యుత్ పనుల సమయంలో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా ఈ ప్రమాదానికి అసలు కారణాలేంటి అధికారుల విచారణలో ఏం తేలనుంది? అనేది వేచి చూడాలి.

ఈ నెల 22న పండుగ సాయన్న జయంతి వేడుకలు

రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని బానిస నారాయణ పిలుపు

అందోల్, అక్టోబర్ 19, (ప్రజా జ్యోతి):

తెలంగాణ ప్రజా వీరుడు పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను ఈ నెల 22న రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సామాజిక చైతన్య సంఘం అధ్యక్షుడు బానిస నారాయణ ముదిరాజ్ పిలుపునిచ్చారు. సోమవారం జోగిపేటలో జయంతి పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరొందిన పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి, ధైర్యసాహసాలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన చరిత్ర, ఆశయాలను భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించడం హర్షణీయమన్నారు.ఈ నెల 22న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే జయంతి వేడుకలకు ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు బిక్షపతి, నాదులాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు చెన్నయ్య పాల్గొన్నారు.

చెడుపై మంచి విజయమే విజయదశమి సందేశం

దసరా పండుగను సుఖసంతోషాలతో పండుగను జరుపుకోవాలి.

బీఆర్ఎస్ తోగర్వల్లి గ్రామ అధ్యక్షులు ఎర్రోళ్ల రవి.

కొండాపూర్ ప్రజా జ్యోతి

విజయదశమి పండుగను పురస్కరించుకొని కొండాపూర్ మండల ప్రజలందరికీ బీఆర్ఎస్ పార్టీ తోగర్వల్లి గ్రామ అధ్యక్షులు ఎర్రోళ్ల రవి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు నింపాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎర్రోళ్ల రవి మాట్లాడుతూ.. విజయదశమి అనేది చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ఈ పండుగ ప్రజలకు ధర్మం, నిజాయితీ, ఐకమత్యం వంటి విలువలను గుర్తుచేస్తుందని అన్నారు. ప్రజలందరూ పరస్పర ప్రేమాభిమానాలతో, సోదరభావంతో పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల మధ్య ఐకమత్యం మరింత బలపడాలని, ప్రతి గ్రామం అభివృద్ధి చెందుతూ ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, యువత తమ లక్ష్యాలను సాధించాలని, ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలని కోరుకున్నారు.విజయదశమి పండుగ ప్రతి ఒక్కరికీ విజయాలను అందించి, ప్రజల జీవితాల్లో నూతనోత్సాహాన్ని నింపాలని ఎర్రోళ్ల రవి ఆకాంక్షించారు.

శ్రీ ముమ్మదేవి అమ్మవారి సన్నిధిలో కాంగ్రెస్ నాయకుల ప్రత్యేక పూజలు

రాయికోడ్ అక్టోబర్ 19 (ప్రజాజ్యోతి):

గ్రామంలో కొలువుదీరిన శ్రీ ముమ్మదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు దుర్గామాత రూపంలో అలంకరించిన అమ్మవారిని పలువురు కాంగ్రెస్ నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ సుధాకర్ రెడ్డి,వైస్ చైర్మన్ వినయ్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేదార్నాథ్ పాటిల్, మాజీ మండల అధ్యక్షుడు నర్సింలు,కుస్నూర్ గ్రామ సర్పంచ్ రాజశేఖర్ గౌడ్,సింగీతం మాజీ యూత్ అధ్యక్షుడు ప్రభాకర్, రఫీక్, కురుమ రాజు తదితరులు పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాలతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.



కొండాపూర్ మండల ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

కాంగ్రెస్ పార్టీ కొండాపూర్ మండల అధ్యక్షులు మల్లారెడ్డి.

కొండాపూర్ ప్రజా జ్యోతి

కొండాపూర్ మండల ప్రజలందరికీ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు కాంగ్రెస్ పార్టీ కొండాపూర్ మండల అధ్యక్షులు మల్లారెడ్డి. విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షించారు.చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రజలందరిలో నూతన ఉత్సాహాన్ని నింపాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకున్నారు. ప్రజలంతా ఐకమత్యంతో, సోదరభావంతో పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఈ సందర్భంగా మల్లారెడ్డి ఆకాంక్షించారు.